## క్లుప్తంగా

### మూలాంకురేశ్వరికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారికి చైత్ర బహుళ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం విశేష పూజలు చేశారు. ప్రాతఃకాలంలో అర్చకులు అయ్యన్నశాస్త్రి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో లలితా అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### పంట కాలువల్లో పూడికతీత పనులు

ఫిరంగిపురం: మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధిహామీ పనులు వేగంగా జరుగుతున్నాయి. వర్షాకాలంలో పంట కాలువల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధి కూలీలు పూడికతీత పనులు చేపడుతున్నారు. అన్ని గ్రామాల్లో పంట కాలువల పూడికతీత పనులతో పాటు పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసేందుకు వీలుగా తవ్వకాలు నిర్వహిస్తున్నామని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. వేసవికాలం కావడంతో వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు , ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు ఫీల్డు అసిస్టెంట్ల వద్ద ఉన్నట్లు చెప్పారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలకంపాడు సెంటర్‌లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు నులకపేట, ఉండవల్లి, పోలకంపాడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### జాగ్రత్తలతో వడదెబ్బ నుంచి ఉపశమనం

ఫిరంగిపురం: వేసవికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బకు దూరంగా ఉండవచ్చని వైద్యురాలు ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని 113తాళ్లూరు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 202 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వడదెబ్బ వల్ల ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రోగులకు వివరించారు. ఎండవేడి అధికంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు బయట తిరగ కూడదని చెప్పారు. చలివేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని వడదెబ్బ తగిలిన వారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సాగర్‌రాణి, ఏఎస్ఎం సరోజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### పత్రికా స్వేచ్ఛపై సమావేశం

లక్ష్మీపురం: పత్రికలు, మీడియా నిష్పక్ష పాతంగా పని చేసే విధంగా ప్రోత్సహించాలని ఉపాధ్యాయ, ఉద్యమ నాయకులు ఎ.వి.రామారావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించారు. పౌర హక్కుల నాయకులు ఎల్.మురళీకృష్ణ మాట్లాడారు.

### వాహనాల తనిఖీలు

పట్నంబజారు: ఎన్నికల ప్రక్రియలో భాగంగా గుంటూరు జిల్లాలో రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. శుక్రవారం గుంటూరు బుడంపాడు బైపాస్, నల్లచెరువు, పొన్నూరు రోడ్డు ప్రాంతాల్లో ఆర్టీఓలు ఎం.గోపాల్, ప్రసాద్, ఎంవీఐలు రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లేశ్వరి, సంధ్య, సౌజన్యలతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ వాహనాల తనిఖీలు నిత్యం కొనసాగుతాయని తెలిపారు.

### క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపికయ్యారు. ఐటీఎం స్కిల్స్ అకాడమీ సంస్థ ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలల నుంచి 37 మంది రాత, మౌఖిక పరీక్ష నిర్వహించి 13 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కంపెనీ ప్రతినిధులు మరో 15 మందిని తదుపరి ప్రక్రియకు ఎంపిక చేశారు. హెచ్ఆర్ మేనేజర్లు షహీనా, కళావతి నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు మూనిస్‌ఖాన్, కె.అపర్ణ పర్యవేక్షించారు.

# మా ఉసురు మీకు తగలక మానదు

- చంద్రబాబు కుటిల రాజకీయాలపై పండుటాకుల ఆక్రోశం
- బ్యాంకుల వద్ద పింఛను సొమ్ము కోసం పడిగాపులు
- ఐదేళ్ల క్రితం బాబు పాలనలో పడ్డ కష్టాలను గుర్తు చేసుకుంటున్న లబ్ధిదారులు
- నగదు విత్‌డ్రా ఫారాలు నింపమంటూ పలువురిని వేడుకున్న అవ్వాతాతలు



పింఛను కోసం తాడేపల్లి అలహాబాద్ బ్యాంక్‌లో బారులు తీరిన జనం

తాడేపల్లిరూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెనువెంటనే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న పింఛను సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరిగి తీవ్ర అసహనానికి గురవుతున్న అవ్వాతాతల పింఛను కష్టాలకు చెక్ పెట్టారు. వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి వారి ద్వారా ఇంటివద్దకే పింఛన్ పంపిణీ చేయించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వీరంతా వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తారనే దురుద్దేశ్యంతో మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ ప్రసాద్‌ను అడ్డం పెట్టుకొని ఎన్నికల సమయంలో వలంటీర్లు పెన్షన్ పంపిణీ చేయడానికి వీలు లేదంటూ కోర్టును ఆశ్రయించేలా చేయటంలో టీడీపీ నాయకులు తెర వెనుక రాజకీయాలు చేసి సఫలమయ్యారు. ఆ తరువాత లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలంటూ కోర్టును ఆశ్రయించడంతో మేనెల సామాజిక పెన్షన్లు బ్యాంకులో తీసుకోవాల్సి వచ్చింది. 1వ తేదీ అందాల్సిన పెన్షన్ బ్యాంకు ఖాతాల్లో వేయడంతో 3వ తేదీ వరకు లబ్ధిదారుల చేతుల్లోకి చేరలేదు. శుక్రవారం పెన్షన్లు తీసుకునేందుకు అవ్వాతాతలతో పాటు, వికలాంగులు, వితంతువులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకేసారి వందలాది మంది లబ్ధిదారులు బ్యాంకుల వద్దకు రావడంతో సిబ్బంది పెన్షన్ల విత్‌డ్రా ఫామ్స్ రాయలేక, వచ్చిన వారికి సమాధానం చెప్పలేక తీవ్ర వొత్తిడికి లోనయ్యారు. విత్‌డ్రా ఫాం రాసేవారు లేక బ్యాంకుల సమీపంలోని కిరాణా దుకాణాలు, పాన్ షాపుల వద్దకు వెళ్లి విత్‌డ్రా ఫాంలు నింపాలని వృద్ధులు, వికలాంగులు వేడుకున్న దృశ్యాలు అగుపించాయి. తాడేపల్లి అలహాబాద్ బ్యాంక్ వద్ద ఓ వికలాంగుడు విత్‌డ్రా ఫారాలు రాస్తుండటంతో ఆయన చుట్టూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు చేరి తమకు కూడా రాయాలని ప్రాధేయపడ్డారు. మలి వయసులో ఉన్న తమపై చంద్రబాబు ఎందుకు ఇంతలా కక్ష కట్టారంటూ వృద్ధులు, వికలాంగులు కన్నీరు పెట్టుకున్నారు. టీడీపీ నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని ఆగ్రహంతో ఊగిపోయారు.



చిరు దుకాణాల వద్ద పింఛను కోసం పడిగాపులు పడుతున్న లబ్ధిదారులు

### బ్యాంకులో డబ్బులు తీసుకోవడం తెలియదు



నేను 40 ఏళ్ల నుంచి పోలకంపాడు సంజీవయ్యనగర్‌లో నివాసముంటున్నాను. ఎప్పుడూ బ్యాంకు దగ్గరకు రాలేదు. బ్యాంకులో డబ్బులు ఎలా తీసుకోవాలో కూడా తెలియదు. టీడీపీ వాళ్లు మాలాంటి వారి పట్ల ఇలాంటి పాడు పనులు చేయడం దుర్మార్గం. జగన్‌బాబు ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి ఇంటికే పెన్షన్ తీసుకొచ్చి ఇస్తున్నారు. గతనెల సచివాలయం వద్ద ఇచ్చారు. రెండు మూడు రోజుల తరువాత పెన్షన్ తీసుకున్నాం. ఇప్పుడేమో బ్యాంకుల్లో వేశాం తీసుకోండంటున్నారు. అక్కడ ఎలా డబ్బులు తీసుకోవాలో అర్థం కావడం లేదు.

– గోగుల కోటేశ్వరమ్మ, పోలకంపాడు.

### పింఛను డబ్బు అందక మందులు కొనలేదు



నాది పేద కుటుంబం. నా కొడుకు జీవనోపాధి కోసం తాడేపల్లి వచ్చాడు. ఇక్కడ ప్లాస్టిక్ మూతలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. నా భార్య చనిపోవడంతో నా కొడుకు దగ్గరకు వచ్చాను. నెలకు రూ.2 వేలు మందులకు అవుతాయి. ఆ భారం నా కొడుకు భరించలేడు. జగన్‌బాబు ప్రభుత్వం వచ్చిన తరువాత వృద్ధాప్య పింఛను ఇస్తున్నారు. వలంటీర్లు నా పెన్షన్‌ను తాడేపల్లికి మార్చారు. నా బ్యాంక్ అకౌంట్ నరసరావుపేటలో ఉంది. ఇప్పుడు నేను పెన్షన్ తీసుకోవాలంటే నరసరావుపేట వెళ్లాలి. ఈ ఎండల్లో వెళ్లలేక మందులు కొనుక్కోలేదు.

– బత్తుల రాము, తాడేపల్లి.

# విద్యావంతులు సామాజిక స్పృహతో మెలగాలి

సామాజిక రంగ ప్రముఖుల సమ్మేళనంలో సందేశమిచ్చిన వక్తలు




సమ్మేళనంలో ప్రసంగిస్తున్న నిషాంత్ అగర్వాల్

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం విద్యావంతులు, సామాజిక రంగ ప్రముఖుల ప్రత్యేక సమ్మేళనం నిర్వహించారు. ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠి కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రఖ్యాత విద్యావంతులు, సామాజిక రంగ ప్రముఖులు హాజరయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ ప్రొఫెసర్ డాక్టర్ వందనా స్వామి, డీన్ ఆచార్య విష్ణుపద్‌ల పర్యవేక్షణలో చర్చాగోష్ఠి కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. ప్రఖ్యాత విద్యా సంస్థ అక్సూమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ ముఖ్య అతిథిగా దృశ్య మాధ్యమ పద్ధతిలో హాజరయ్యారు. పౌర సమాజ పురోగతిలో సామాజిక రంగ ప్రముఖల పాత్ర ప్రశంసనీయమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో సామాజిక రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. జాతి పురోగతికి దోహదపడే సామాజిక బాధ్యతల్ని విద్యావంతులు, విద్యార్థులు విస్మరించకూడదని హితవు పలికారు. ప్రఖ్యాత విద్యా సంస్థల ప్రతినిధులు లిబీ జాన్సన్, సూరజ్ జాకబ్, రోనక్ షా, నిషాంత్ అగర్వాల్, యామినీ అయ్యార్ తదితరులు సమాజానికి దోహదపడే వివిధ సామాజిక రంగ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

### ఉద్యోగాలకు 30 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన గ్లాండ్ ఫార్మా సంస్థ నిర్వహించిన పూల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బీ ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. గ్లాండ్ ఫార్మా హెచ్ఆర్ జనరల్ మేనేజర్ కె. శాంతి కిరణ సారథ్యంలో ప్రొడక్షన్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఎస్యూరెన్స్ ట్రైనీ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నిర్వహించిన రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో పాల్గొన్న 90 మంది విద్యార్థుల్లో 30 మందిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, ఓఎస్డీ డాక్టర్ పి.సీతారామయ్య అభినందించారు.

# జగనన్న పాలనలో రహదారులకు మహర్దశ

- తాడికొండ మండలంలో రూ.4.20 కోట్లతో అంతర్గత రహదారులు, సీసీ రోడ్ల అభివృద్ధి
- గ్రామాల్లో అద్దంలా రూపుదిద్దుకున్న రహదారులు
- రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన జగనన్న ప్రభుత్వానికి జనం జేజేలు



బడేపురంలో అద్దంలా రూపుదిద్దుకున్న సీసీ రోడ్డు

తాడికొండ: తాడికొండ మండలంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మండల పరిషత్, జిల్లా పరిషత్, ఉపాధి హామీ పథకం అనుసంధానం నిధులతో రూ.4.20 కోట్లు వెచ్చించి గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించారు. ప్రధానంగా తాడికొండలో రావిచెట్టు సెంటర్ నుంచి జయభారత్ కాలనీ వరకు వెళ్లే రహదారిని రూ.60 లక్షలతో అత్యంత సుందరంగా నిర్మించగా కంతేరు గ్రామంలో అంతర్గత రహదారుల అభివృద్ధి భారీగా జరిగింది. బడేపురం, బేజాత్పురం, దామరపల్లి, లచ్చన్నగుడిపూడి, ముక్కామలతో పాటు పలు గ్రామాల్లో సీసీ రోడ్లు పెద్ద ఎత్తున వేయడంతో గ్రామాల్లో కొత్తదనం పరవళ్లు తొక్కుతోంది. గతంలో ఆయా రోడ్లు గుంతలమయంగా మారి వర్షాకాలంలో నడకకు ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి చూసి స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



లచ్చన్నగుడిపూడిలో వేసిన సిమెంటు రోడ్డు



తాడికొండలో రూ.60 లక్షలతో వేసిన సీసీ రహదారి



కంతేరులో నిర్మించిన సీసీ రోడ్డు

# హోం ఓటింగ్ 73 శాతం నమోదు



హోం ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో కీర్తి

నెహ్రూ నగర్: గుంటూరు తూర్పులో 73 శాతం హోం ఓటింగ్‌ని శుక్రవారం పూర్తి చేయడం జరిగిందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం చౌత్రా సెంటర్‌లో జరుగుతున్న హోం ఓటింగ్‌ని తూర్పు నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థుల ఎలక్షన్ ఏజెంట్ల సమక్షంలో కమిషనర్, ఆర్ఓ పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా హోం ఓటింగ్ విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం హోం ఓటింగ్‌కి అమలు చేస్తున్న మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 97 మందిని అర్హులుగా గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. శుక్రవారం ప్రారంభమైన హోం ఓటింగ్ లో 97 మంది ఓటర్లకు గాను 71 మంది ఓట్లు పోల్ చేసి 73 శాతం పోలింగ్ జరిగిందన్నారు. శనివారం హోం ఓటింగ్ లో మిగిలిన వారి ఓట్లు పోల్ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

### వేసవి శిక్షణతో సృజనాత్మక నైపుణ్యాలకు పదును

గుంటూరు ఎడ్యుకేషన్: బాలల్లో దాగిన సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని హైదరాబాద్‌కు చెందిన లిటిల్ ఎడ్యు ఎంటర్‌ప్రైజెస్ సీఈఓ. రమణకుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేట ఆరోలైనులోని హిందూ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం లిటిష్ ఎడ్యు సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా రమణకుమార్, హిందూ ప్రాథమికోన్నత పాఠశాల కార్యదర్శి రామకృష్ణ పరమహంస మాట్లాడారు.

### ఓటు హక్కు వినియోగించుకోవాలి

నగరంపాలెం: ఈనెల 13వ తేదీన ఓటర్లు అందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్ కోరారు. ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–1 స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఓటర్ల అవగాహన, ర్యాలీ నిర్వహించారు. సెబ్ గుంటూరు–1 స్టేషన్ సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా మద్యాన్ని పంపిణీ చేసిన, నిల్వ చేసి రవాణా చేసిన వారి సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.తులసి, ఆర్టీసీ/ సెబ్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

# హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నదే

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య
- నగరంలోని పలు వార్డులు, భగత్‌సింగ్ నగర్, పార్క్‌రోడ్, యాదవ బజారులో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మురుగుడు లావణ్య

మంగళగిరి: రాష్ట్రంలో పేద ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని మంగళగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య అన్నారు. శుక్రవారం నగరంలోని 30,31,32 వార్డులు, భగత్‌సింగ్ నగర్, పార్క్‌రోడ్, యాదవ బజారులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి ఒక్క హామీని తూచా తప్పకుండా అమలు చేయటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. ఓటర్లను మభ్యపెట్టి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే దురుద్దేశంతో చంద్రబాబు నోటికి వచ్చిన హామీలిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడం ద్వారా అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. జగనన్న పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత మంగళగిరి నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా హోమ్ ఓటింగ్



తాడేపల్లి సంజీవయ్యనగర్‌లో వికలాంగుడి వద్ద ఓటు వేయించేందుకు వచ్చిన అధికారులు

- 89 బూత్‌లలో 98 ఓట్లు
- మొదటిరోజు 28 మందితో ఓటింగ్ వేయించిన అధికారులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం వికలాంగులు, 80 ఏళ్లు పైబడిన వారికి ఓటు హక్కును ఇంటివద్దనే వినియోగించుకునే విధంగా అవకాశం కల్పించింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు తాడేపల్లి మండల, పట్టణ పరిధిలో మొత్తం 89 బూత్‌లలో 98 ఓట్లు ఉండగా, శుక్రవారం మొబైల్ వ్యాన్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే వికలాంగులు, వృద్ధుల వద్దకు బీఎల్‌ఓలు, అధికారులు వచ్చి వారి ఓటు హక్కు వినియోగించునే విధంగా అవకాశం కల్పించారు. ఒక్కొక్క ఓటరు వద్దకు ముందుగా అధికారులు వెళ్లి డాక్యుమెంట్ మొత్తం పూర్తి చేస్తున్నారు. అనంతరం అక్కడ ఉన్న సిబ్బందిని, బీఎల్‌ఓలను, ఇతరులను బయటకు పంపి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టారు. తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో 6వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, వికలాంగులు, వృద్ధులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు వెల్లడించారు.



తాడికొండ మండలంలో హోం ఓటింగ్ వినియోగించుకుంటున్న దివ్యాంగురాలు

### ముగిసిన తొలిరోజు హోం ఓటింగ్

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో తొలిరోజు హోం ఓటింగ్‌ను 120 మంది వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం గంగరాజు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 449 మంది వికలాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఉండగా తొలి రోజు హోం ఓటింగ్ కార్యక్రమంలో భాగంగా 10 రూట్లలో ఎన్నికల సిబ్బంది వారి ఇంటివద్దకు వెళ్లి ఓట్లు తీసుకునే కార్యక్రమం కొనసాగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 8వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. వీలైనంత త్వరగా ఓటింగ్ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శనివారం తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల కమిషనింగ్ గుంటూరులోని జేకేసీ కళాశాలలో జరుగుతుందని ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పార్లమెంటుకు సంబంధించిన కమిషనింగ్ ప్రారంభమవుతుందన్నారు. 244 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్‌ను అమర్చి తగిన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ను అనుసంధానించటం జరుగుతుందన్నారు. వాటిని సీల్ చేసి పంపిణీ చేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంగరాజు తెలిపారు.

# రోటరీ కరావలంబన ట్రస్టు ఏర్పాటు



రోటరీ కరావలంబన ట్రస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మంగళగిరి: సమాజ హితం కోసం చేసే పలు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలనే సంకల్పంతో 'రోటరీక్లబ్ ఆఫ్ మంగళగిరి' ఆధ్వర్యంలో మంగళగిరి రోటరీ కరావలంబన ట్రస్ట్‌ను రోటరీ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి ప్రారంభించి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారు చేస్తున్న సర్వీసు ప్రాజెక్ట్‌లకు నిధులు సమకూర్చుతున్న పలువురు దాతలు, సంస్థలకు ఆదాయపన్ను రాయితీలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిబంధనలకు అనుగుణంగా నిధుల వినియోగానికి అర్హత వంటి ప్రయోజనాలను ఈ ట్రస్ట్ ద్వారా కల్పించవచ్చునన్నారు. నగరంలోని గణపతినగర్‌లో రోటరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంగళగిరి రోటరీ కరావలంబన ట్రస్ట్ లోగోను ఏ డీజీఈ శరత్ చౌదరి, పీడీజీ అన్నే రత్నప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు అందే రేవెంత్, కార్యదర్శి గాజుల శ్రీనివాసరావులతో పాటు రోటరీ ప్రతినిధులు అందె మురళి, పారేపల్లి నిరంజన్ గుప్తా, మాజేటి వంశీ కృష్ణ, ప్రగడ రాజశేఖర్, వడ్లమూడి శ్రీనివాసరావు, కాపరౌతు సుందరయ్య, దామర్ల సతీష్ పాల్గొన్నారు.

# ప్రతిభావంతులకు ప్రోత్సాహంతో మరింత రాణింపు



విద్యార్థులతో పూర్ణచంద్రరావు, ఎస్వీ రమణ, లలిత, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా మరింతగా రాణిస్తారని ఏఎన్‌యూ టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ పి. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను బహూకరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి, మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ పరీక్షలకు హాజరైన విద్యార్థులందరు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వారిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ టీడీ విమల తన భర్త డాక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి పేరుతో స్మారక నగదు బహుమతులను అందజేశారని తెలిపారు. ఎంబీఏ విభాగంలో మువ్వల అనూష ప్రథమ బహుమతి, బడుగు నవ్యశ్రీ, గొరిగె దేవిక ద్వితీయ, తాటిపాకల మౌనశ్రీ తృతీయ బహుమతి పొందారని వివరించారు. ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో గుంటి స్టెల్లీ ప్రథమ బహుమతితో పాటు ముదమాల నవ్యశ్రీ, జరపాల శిరీష బాయ్ ద్వితీయ, గంగుల లీలా వెంకట్ తృతీయ బహుమతి అందుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, ఎస్. గోపి శ్రీనివాసరావు, సీహెచ్ వైష్ణవి, ఏ.బాజీబాబు, సీహెచ్ వేదవతి, మణికంత, బి. అనిత, అభిలాష్ పాల్గొన్నారు.